


# మన దునియా

మన అక్షరం - మన ప్రపంచం

RNI Number
TELTEL/2023/85680



రిపోర్టర్లు కావలెను

తెలుగులో రాయగల సమర్థత, సమాజం పట్ల అవగాహన ఉంటే చాలు.

మన దునియా

సంప్రదించండి...
9490056011,9603969335



సంపుటి : 3 | సంచిక : 321 | జులై 19 ఆదివారం 2026 | పేజీలు : 8 | వెల రూ. 4.00/-






## అనుమతులు లేవా...

# అడ్మిషన్లు ఎలా...?




### ఫిజిక్స్ వాలా జూనియర్ కాలేజీపై స్వేరో స్టూడెంట్స్ యూనియన్ ఫిర్యాదు




- భారీ ఫీజులు, డొనేషన్ పేరుతో వసూళ్లు చేస్తున్నారన్న ఆరోపణలు
- అనుమతులు లేవా... అడ్మిషన్లు తీసుకుంటున్నారన్న ఆరోపణ
- వెంటనే విచారణ చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్

## విద్యార్థులు, తల్లిదండ్రుల ప్రయోజనాల కోసం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి

**మన దునియా,హనుమకొండ:జులై 18**

హనుమకొండ నగరంలో ఫిజిక్స్ వాలా జూనియర్ కాలేజీ అనుమతులు లేకుండానే నిర్వహిస్తున్నారని ఆరోపిస్తూ, వెంటనే విచారణ చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్వేరో స్టూడెంట్స్ యూనియన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఎల్తూరి సాయికుమార్ డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ, సరైన అనుమతులు, మౌలిక వసతులు లేకుండానే విద్యార్థుల నుంచి అడ్మిషన్లు తీసుకుంటూ విద్యా వ్యాపారం జరుగుతోందని ఆరోపించారు. డే స్కాలర్ విద్యార్థుల నుంచి రూ. 1.15 లక్షల ఫీజుతో పాటు రూ. 15 వేల డొనేషన్ పేరుతో అదనపు మొత్తాలు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు.కాలేజీ చైర్మన్ గురించి తల్లిదండ్రులు, విద్యార్థులు ప్రశ్నిస్తే స్పష్టమైన సమాధానం ఇవ్వడం లేదని, “చైర్మన్ ఇక్కడ ఉండరు, ఆయనకు సంబంధం లేదు” అంటూ భిన్నమైన సమాధానాలు చెబుతున్నారని ఆరోపించారు. అలాగే రెండు వేర్వేరు పేర్లతో బస్సులు నడపడం వల్ల తల్లిదండ్రుల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు.ఈ ఆరోపణలపై జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి వెంటనే స్పందించి, కాలేజీ అనుమతులు, గుర్తింపులు, ఫీజుల వసూళ్లు, బస్సుల నిర్వహణ

(మిగతా 2వ పేజీలో..)

మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం

## కేసీఆర్ కుటుంబీకులు నిజాం రాజును మించిన ధనవంతులుగా మారారు: రేవంత్ రెడ్డి

ఘట్‌కేసర్‌లో అందెశ్రీ స్మృతివనానికి భూమిపూజ

అందెశ్రీ ఒక ఆత్మబంధువు అని కొనియాడిన సీఎం రేవంత్ రెడ్డి

కేసీఆర్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు

ఏడాదిలోనే 70 వేల ఉద్యోగాలు ఇచ్చామని వెల్లడి

తాను సీఎంగా ఉండగా బీఆర్ఎస్ అధికారంలోకి రాదని స్పష్టం



కేసీఆర్ కుటుంబం వందలాది ఎకరాల్లో ఫామ్‌హౌస్‌లు నిర్మించుకుందని, వారు నిజాం రాజును మించిన ధనవంతులుగా ఎదిగారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. ప్రముఖ కవి, గాయకుడు, తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిదాత అందెశ్రీ గౌరవార్థం ఘట్‌కేసర్‌లో నిర్మించనున్న 'అందెశ్రీ స్మృతివనం' పనులకు ముఖ్యమంత్రి శనివారం భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన ప్రసంగిస్తూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "దొరల గడీల ముందు తలవంచను" అని చాటిచెప్పిన ధైర్యశాలి అందెశ్రీ అని ముఖ్యమంత్రి కొనియాడారు. ప్రజల కవిగా, గాయకుడిగా అందెశ్రీ అందించిన సేవలను స్మరించుకుంటూ, ఆయనను తన 'ఆత్మబంధువు'గా అభివర్ణించారు. గత పాలకులు ఆయన వంటి గొప్ప కళాకారులను విస్మరించారని మండిపడ్డారు. ఇదే క్రమంలో, కల్వకుంట్ల కుటుంబంపై రేవంత్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. గత ప్రభుత్వ హయాంలో నిరుద్యోగ యువతను పట్టించుకోకపోవడంతో వారు ఆత్మహత్యలకు పాల్పడ్డారని, ఏళ్ల తరబడి గ్రూప్–1 వంటి పరీక్షలు కూడా నిర్వహించలేదని రేవంత్ రెడ్డి ఆరోపించారు. అందుకు భిన్నంగా, తమ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే సుమారు 70 వేల ఉద్యోగాలను భర్తీ చేసిందని, అభ్యర్థుల తల్లిదండ్రుల సమక్షంలోనే నియామక పత్రాలను అందజేస్తున్నామని తెలిపారు. తాను ముఖ్యమంత్రిగా ఉన్నంత కాలం బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వచ్చే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. ఫామ్‌హౌస్‌ల నిర్మాణం కోసం కేసీఆర్ కుటుంబం తెలంగాణ సంపదను దోచుకుందని, మళ్లీ ఎవరైనా అటువంటి ప్రయత్నం చేస్తే ఎదిరించడానికి అందెశ్రీ పాట రూపంలో పుడతాడని హెచ్చరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అందెశ్రీని తీవ్రంగా నిర్లక్ష్యం చేసిందని దుయ్యబట్టారు. ప్రజాకవి గద్దర్‌ను సైతం ప్రజాభవన్ గేటు వద్ద ఎర్రటి ఎండలో నిలబెట్టి అవమానించారని మండిపడ్డారు. వారిద్దరిని అవమానించినప్పుడే దొరల పాలనకు చరమగీతం పాడాలని తెలంగాణ ప్రజలు నిర్ణయించుకున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

## 'భారత్‌ను గర్వపడేలా చేశారు'... విక్రమ్–1 సక్సెస్ తర్వాత స్కైరూట్‌కు మోదీ ఫోన్!

భారత తొలి ప్రైవేట్ రాకెట్ విక్రమ్–1 ప్రయోగం విజయవంతమైన వెంటనే ప్రధాని నరేంద్ర మోదీ స్కైరూట్ బృందానికి ఫోన్ చేసి అభినందించారు. సతీశ్ ధావన్ అంతరిక్ష కేంద్రంలో సంబరాలు జరుగుతున్న సమయంలో వచ్చిన ఈ కాల్‌లో యువ శాస్త్రవేత్తల కృషిని ప్రధాని ప్రశంసించారు. స్కైరూట్ సీఈఓ, సహ వ్యవస్థాపకుడు పవన్ కుమార్‌తో మాట్లాడిన మోదీ.. "మీరు భారత్‌ను గర్వపడేలా చేశారు. భారత ఆశయాలను అంతరిక్షంలో నిలబెట్టారు. యువత కలలకు బలమైన పునాది వేశారు" అని అన్నారు. భారత యువతపై తనకున్న నమ్మకాన్ని ఈ బృందం నిజం చేసిందని కొనియాడారు. దీనికి పవన్ స్పందిస్తూ.. తమ బృందం సగటు వయసు కేవలం 28 ఏళ్లు మాత్రమేనని చెప్పారు. దీనిపై మోదీ మాట్లాడుతూ.. భారత యువతను నమ్మితే అద్భుతాలు చేయగలరని ఈ విజయం మరోసారి నిరూపించిందన్నారు. ఈ చారిత్రక క్షణంలో తాను కూడా భాగం కావాలనే ఉద్దేశంతోనే ఫోన్ చేసినట్లు చెప్పారు. 'ఆగమన్' పేరుతో చేపట్టిన ఈ మిషన్ స్కైరూట్ ప్రయాణానికి ఆరంభం మాత్రమేనని, ముందు ఇంకా ఎన్నో విజయాలు సాధించాలని మోదీ ఆకాంక్షించారు. ఈ తొమ్మిది నిమిషాల సంభాషణలో భారత అంతరిక్ష రంగాన్ని కొత్త స్థాయికి తీసుకెళ్లినందుకు బృందాన్ని అభినందించారు. ప్రయోగానికి ముందు ప్రధాని చేతిరాతలో పంపిన 'వందేమాతరం' సందేశాన్ని విక్రమ్–1తో పాటు అంతరిక్షంలోకి తీసుకెళ్లినట్లు పవన్ తెలిపారు. దీనిపై స్పందించిన మోదీ.. జాతీయ గీతానికి 150 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా, యువతకు ఎప్పటికీ స్ఫూర్తిగా నిలిచే సందేశం కావడంతోనే ఆ పదాలను రాశానన్నారు. చివరగా "ముందుకు సాగండి... మరింత ఎత్తుకు ఎగరండి... నేను మీ వెంటే ఉంటాను" అంటూ స్కైరూట్ బృందానికి శుభాకాంక్షలు తెలిపారు.


# కృష్ణవేణి కాలేజీ బరితెగింపు...!

**అనుమతులు ఉన్నాయా...? లేక అడ్మిషన్లే లక్ష్యమా...?**

**విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమా...?**


**విద్యాశాఖ అధికారులు స్పందించాల్సిన అవసరం..!**

**మన దునియా,హనుమకొండ:జులై 18**





హనుమకొండలో నిర్వహణలో ఉన్న కృష్ణవేణి కాలేజీపై పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కాలేజీ నిర్వహణకు అవసరమైన ప్రభుత్వ అనుమతులు, గుర్తింపులు, మౌలిక సదుపాయాలు, అర్హత కలిగిన అధ్యాపకులు వంటి అంశాలపై స్పష్టత ఇవ్వాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు. కాలేజీ పేరుతో భారీ స్థాయిలో అడ్మిషన్లు చేపడుతున్న నేపథ్యంలో, సంబంధిత శాఖల నుంచి అన్ని అనుమతులు తీసుకున్నారా? విద్యార్థుల నుంచి వసూలు చేస్తున్న ఫీజులకు అధికారిక రసీదులు ఇస్తున్నారా? ఫీజు నిర్మాణం ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఉందా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.



విద్యాసంస్థల్లో కనీస మౌలిక సదుపాయాలు, భద్రతా ప్రమాణాలు, అర్హత కలిగిన అధ్యాపకులు తప్పనిసరి. అయితే కృష్ణవేణి కాలేజీలో ఇవన్నీ పూర్తిస్థాయిలో అమలవుతున్నాయా అనే అంశంపై అధికారులు సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన అంశం కావడంతో, జిల్లా విద్యాశాఖ అధికారులు కాలేజీలో తనిఖీలు నిర్వహించి వాస్తవాలను వెల్లడించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. ఒకవేళ నిబంధనల ఉల్లంఘనలు ఉంటే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ఆరోపణలు నిరాధారమైతే వాటిని కూడా అధికారికంగా స్పష్టం చేయాలని ప్రజలు కోరుతున్నారు. "విద్య వ్యాపారం కాకూడదు... విద్యార్థుల భవిష్యత్తు విషయంలో రాజీ ఉండకూడదు" అనే అభిప్రాయం స్థానికంగా వ్యక్తమవుతోంది. సంబంధిత అధికారులు ఈ అంశంపై త్వరితగతిన స్పందించి వాస్తవాలను ప్రజల ముందుంచాల్సిన అవసరం ఉంది.

## 'ఇప్పటి వరకు ఒక లెక్క.. ఇక నుంచి మరో లెక్క'.. సీఎం రేవంత్‌కు కేటీఆర్ సవాల్

ఉద్యోగాలపై కాంగ్రెస్‌ను నిలదీసిన కేటీఆర్

70 వేల ఉద్యోగాలపై బహిరంగ సవాల్

నోటిఫికేషన్లు కాదు.. లూటిఫికేషన్ జరుగుతోందని విమర్శ

హామీలు నెరవేర్చకపోతే యువతే తీర్పు చెబుతుందన్న వ్యాఖ్య

యువ సంగ్రామ సదస్సులో మాట్లాడిన కేటీఆర్



తెలంగాణలో ఉద్యోగాల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం యువతను మోసం చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఎన్నికల హామీలు అమలు చేయకుండా ఉద్యోగ 'నోటిఫికేషన్ల' స్థానంలో 'లూటిఫికేషన్లు' చేస్తున్నారని విమర్శించారు. సరూర్‌నగర్‌లో నిర్వహించిన 'యువ సంగ్రామ' సదస్సులో మాట్లాడిన ఆయన.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్ర విమర్శలు గుప్పించారు. "రేవంత్ గుర్తు పెట్టుకో.. నీ క్లైమాక్స్ హిట్లర్ కంటే దారుణంగా ఉంటుంది" అని హెచ్చరించారు. "ఇప్పటి వరకు ఒక లెక్క.. ఇక నుంచి మరో లెక్క. కాంగ్రెస్ ప్రభుత్వానికి యువతే తగిన గుణపాఠం చెబుతుంది. ప్రజలు, నిరుద్యోగ యువత ఈ అవమానాలను ఎప్పటికీ మర్చిపోరు" అని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టో ప్రపంచంలోనే అతిపెద్ద మోసమని ఆరోపించారు. ఎన్నికల సమయంలో మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని అశోక్‌నగర్‌లో ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ హామీ ఇచ్చారని, కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలను విస్మరించారని విమర్శించారు. కాంగ్రెస్ నేతలు ఉద్యోగాల క్యాలెండర్‌ను పక్కనపెట్టి జేబులు నింపుకోవడంపైనే దృష్టి పెట్టారని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం చెబుతున్నట్లు 70 వేల ఉద్యోగాలు నిజంగానే ఇచ్చి ఉంటే.. అందుకు సంబంధించిన నోటిఫికేషన్లతో సహా నిరూపించాలని కేటీఆర్ సవాల్ విసిరారు. అలా నిరూపిస్తే తాను శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకొని రాహుల్ గాంధీకి జై కొడతానని ప్రకటించారు. ఈ సభ కాంగ్రెస్ చేసిన 'మహాద్రోహాన్ని' యువతకు గుర్తు చేసేందుకేనని అన్నారు. ఉద్యోగాలు అడిగిన యువతపై పోలీసులు దాడులు చేయడం దారుణమని కేటీఆర్ మండిపడ్డారు. యువత ఆకాంక్షలను అర్థం చేసుకోకుండా కాంగ్రెస్ ప్రభుత్వం అహంకారంతో వ్యవహరిస్తోందని విమర్శించారు. కేసీఆర్ హయాంలో జారీ చేసిన నోటిఫికేషన్లకే ఇప్పుడు నియామక పత్రాలు ఇచ్చి రేవంత్ రెడ్డి ప్రభుత్వం క్రెడిట్ తీసుకుంటోందని కేటీఆర్ ఆరోపించారు. ఒక మంత్రి ఒక మాట, మరో మంత్రి మరో మాట చెబుతూ ఉద్యోగాల విషయంలో ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో భూములు, ఇసుక లూటీ జరుగుతోందని, ప్రజలు హామీల గురించి ప్రశ్నిస్తే వారిని అవమానిస్తున్నారని విమర్శించారు.

# అనుమతులు లేవా... అడ్మిషన్లు ఎలా...?

(మొదటి పేజీ తరువాయి)

తదితర అంశాలపై సమగ్ర విచారణ చేపట్టాలని, నిబంధనల ఉల్లంఘనలు నిర్ధారణ అయితే తక్షణ చర్యలు తీసుకుని విద్యార్థుల ప్రయోజనాలను కాపాడాలని స్వేరో స్టూడెంట్స్ యూనియన్ డిమాండ్ చేసింది.

మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం
జులై । ఆదివారం । 19 । 2026


# ప్రజలకు నీటి ఎద్దడి లేకుండా చూడాలి: ఎమ్మెల్యే డా. భూపతి రెడ్డి





- RWS, మిషన్ భగీరథ ఇంజనీర్లతో సమీక్ష సమావేశం
- తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశం
- పైప్‌లైన్ లీకేజీలు, నీటి వృథాపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచన

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి మన దునియా:**

నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ ప్రజలకు ఎలాంటి తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా పనిచేయాలని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. భూపతి రెడ్డి ఆదేశించారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో RWS, మిషన్ భగీరథ ఇంజనీర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పలు కీలక సూచనలు చేశారు. వర్షాకాలంలోనూ తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించిన ఎమ్మెల్యే, మిషన్ భగీరథ పైప్‌లైన్‌లలో లీకేజీలు, ఇతర సాంకేతిక సమస్యలు ఎక్కడా లేకుండా నిరంతర పర్యవేక్షణ చేయాలని అధికారులను ఆదేశించారు.మరమ్మత్తులు అవసరమైన చోట వెంటనే పూర్తి చేసి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని చెప్పారు. నీటి వృథాను నివారించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవడంతో పాటు ప్రజల్లో నీటి పొదుపుపై అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే భూగర్భ జలమట్టం పెరిగేలా నీటి సంరక్షణ కార్యక్రమాలు చేపట్టాలని పేర్కొన్నారు. తాగునీటి సరఫరాలో సమయపాలన పాటించాలని, ప్రతి గ్రామానికి నిర్ణీత సమయానికి నీటిని అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తాగునీటి నాణ్యతపై నిరంతరం క్వాలిటీ చెకింగ్ నిర్వహించాలని, శిథిలావస్థలో ఉన్న వాటర్ ట్యాంకులను గుర్తించి తగిన మరమ్మత్తులు చేయాలని సూచించారు. ప్రమాదకర స్థితిలో ఉన్న వాటర్ ట్యాంకులను వెంటనే డిస్మెంటల్ చేసి ప్రజల ప్రాణాలకు ఎలాంటి ముప్పు లేకుండా చూడాలని అన్నారు. ప్రజల నుంచి తాగునీటి సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులు రాకుండా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని, సమస్యల పరిష్కారంలో చిత్తశుద్ధితో వ్యవహరించాలని ఎమ్మెల్యే సూచించారు. అధికారులకు ఎలాంటి పరిపాలనా లేదా సాంకేతిక సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.అయితే తాగునీటి సరఫరాలో అలసత్వం, నిర్లక్ష్యం ఏమాత్రం సహించబోమని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో RWS (మిషన్ భగీరథ) ఈఈలు కే. రాకేష్, నరేష్ బాబు, డీఈఈలు నవీన్ రెడ్డి, కౌశిక్, వెంకటేశ్వర్ గౌడ్, ఏడు మండలాల ఏఈఈలు మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# గిరిజన మహిళపై అటవీశాఖ అధికారుల దాడి!

**మన దునియా,కొత్తగూడెం జిల్లా జులై 18**

వానకాలం సీజన్ వచ్చిందంటే చాలు గిరిజన గ్రామాల్లోని రైతులకు ఫారెస్ట్ అధికారులకు పోడు భూముల లొల్లి మొదలవుతుంది, రైతులు ఆ భూము లను సాగు చేయుడా నికి వెళ్లడం అటవీ శాఖ వారు అడ్డు కోవడం పరిపాటిగా మారిపోయింది,తాజాగా భద్రాది కొత్తగూడెం జిల్లాలో పోడు భూముల పోరు మరోసారి ఉద్రిక్తత కు దారి తీసింది, అశ్వాపురం మండలం మాను బోతుల గూడెంలో ఫారెస్ట్ అధికారులు గిరిజన మహిళల మధ్య గొడవ స్పర స్పర దాడుల వరకు వెళ్ళింది. మను బోతుల గూడెం పూర్తిగా మారుమూల గిరిజన గ్రామం సుమారు 30 సంవత్సరాలుగా అక్కడి వలస గిరిజ నులు పోడు భూము లను వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు.అయితే ఈ గ్రామానికి వెళ్ళడానికి సరైన రహదారులు లేకపోవడం కనీసం ఫోన్ కు సిగ్నల్ కూడా ఉండకపో వడంతో అక్కడ జరిగిన గొడవ ఆల స్యంగా వెలుగులోకి వచ్చింది.మణుగూరు ఫారెస్ట్ రేంజర్ ఉపేందర్, నేతృత్వంలో సుమారు 40 మంది సిబ్బంది ఒక్కసారిగా పొలాల్లోకి దూసుకె ళ్లారు.పోడు వ్యవసాయం చేసు కుంటున్న గిరిజనుల తో మొదట



వాగ్వా దానికి దిగిన ఫారెస్ట్ సిబ్బంది,తరువాత దాడికి పాల్పడ్డారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.కనీసం మహిళలు అని చూడకుండా విసిరిపాలయడంతో ముగ్గురు గిరిజన మహిళలు తీవ్రంగా గాయపడ్డారు ప్రస్తుతం వారిని మణుగూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు.

# బుల్లెట్ ట్రైన్ మాకొద్దు..

**బహదూర్ గూడ లో రైతుల ఆందోళన**

మన దునియా,రంగారెడ్డి జిల్లా:జులై 18

రంగారెడ్డి జిల్లా శంషాబాద్ పరిధి లోని బహదూర్ గూడలో శనివారం ఉద్రిక్తత పరిస్థితి చోటు చేసుకుంది. బల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు కోసం సేకరించిన స్థలంలో కంచె వేసేందుకు రెవెన్యూ, హైడ్రా అధికారులు వెళ్లగా.. స్థానికులు అడ్డుకున్నారు. దీంతో ఆ ప్రాంతంలో ఉద్రిక్తత వాతావర ణం నెలకొంది.బుల్లెట్ ట్రైన్ కోసం స్థానిక రైతుల భూములను ఇచ్చేం దుకు నిరాకరిస్తున్నా రు. ఈ క్రమంలో గత ఎనిమిది రోజులుగా ఆందోళనలు కొనసా గిస్తున్నారు. తాము భూములు ఇవ్వాలం టే స్పష్టమైన హామీ లు, తగిన పరిహారం ప్రకటించాలని.. ఆ తరువాతనే తమ భూములు ఇస్తామని రైతులు పేర్కొంటు న్నారు. అయితే, శనివారం ఉదయం హైడ్రా, రెవె న్యూ శాఖల అధికా రులు బహదూర్ గూడలోని రైతుల భూముల వద్దకు రావడంతో రైతులు వారిని అడ్డుకున్నా రు. ఈ క్రమంలో పోలీసులకు, స్థాని కులకు తీవ్ర వాగ్వా దం చోటు చేసుకోవ టంతో టెన్షన్ వాతా వరణం నెలకొంది. ఈ క్రమంలో ఓ రైతు స్పృహతప్పి పడిపో వటంతో అతన్ని ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేయగా.. తోటి రైతులు అడ్డు కున్నారు. తమకు న్యాయం చేశాకే తమ పొలాల వద్ద కంచె వేయాలని స్థానికులు, రైతులు డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో గ్రామంలో భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి పరిస్థి తిని అధికారులు పర్యవేక్షిస్తున్నారు.ప్రస్తుతం అధికారులు రైతులతో చర్చలు జరిపే ప్రయత్నం చేస్తున్నట్లు సమాచా రం. అయితే, తమ డిమాండ్లపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ వచ్చే వరకు వెనక్కి తగ్గేది లేదని రైతులు స్పష్టం చేస్తున్నారు.



## అక్రమ ఇసుక రవాణాకు చెక్.. రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్న అటవీ అధికారులు

**ఖానాపూర్ ఆర్సి మన దునియా,జన్నారం;జూలై18:**




మంచిర్యాల జిల్లా జన్నారం మండలం ఇందన్‌పల్లి రేంజ్ పరిధిలోని ఇందన్‌పల్లి, భర్తన్‌పేట్ సెక్షన్లలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను అటవీ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అక్రమ ఇసుక రవాణా జరుగుతున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు అటవీ శాఖ సిబ్బంది ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నారు. స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్లను తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం అటవీ శాఖ ఆధీనంలో ఉంచి, సంబంధిత నిబంధనల ప్రకారం కేసులు నమోదు చేశారు. ఈ దాడుల్లో విజయ్ కుమార్, డీవైఆర్వో, శేషారామ్, హన్మంతరావు ఎఫ్ఎస్ఓలు, పోచయ్య, మక్బుల్, స్వామి ఎఫ్‌బీఓలు, బేస్ క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు. అక్రమ ఇసుక తవ్వకం, రవాణాపై అటవీ శాఖ కఠిన చర్యలు తీసుకుంటుందని అటవీ రేంజ్ అధికారి జి. లక్ష్మీనారాయణ తెలిపారు. గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనులకు అనుమతులు ఉన్న ఇసుక రీచ్‌ల నుంచే ఇసుకను తరలించాలని సూచించారు. ఇందుకోసం ప్రభుత్వం నిధులు కేటాయిస్తున్నప్పటికీ, కొందరు స్వలాభం కోసం అటవీ ప్రాంతాలు, పర్యావరణ సున్నిత ప్రాంతాల నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారని తెలిపారు. ఇలాంటి చర్యల వల్ల అటవీ శాఖపై ప్రజల్లో అపోహలు ఏర్పడే అవకాశం ఉందని, అటవీ ప్రాంతాలు, పర్యావరణ సున్నిత ప్రాంతాల పరిరక్షణ అందరి బాధ్యత అని పేర్కొన్నారు. ఇసుక భూగర్భ జలాల పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తుందని, ప్రజలు ఈ విషయాన్ని అర్థం చేసుకుని అక్రమ ఇసుక తవ్వకం, రవాణాను అరికట్టడంలో అటవీ శాఖకు సహకరించాలని ఆయన కోరారు.

## చిన్నారుల బంగారు భవిష్యత్తుకు తొలి అడుగు.. కామన్‌పల్లిలో ప్రీ-ప్రైమరీ తరగతుల ప్రారంభం

**రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన సర్పంచుల ఫోరమ్ మండల అధ్యక్షుడు పేరం శ్రీనివాస్**



మంచిర్యాల జిల్లా జన్నారం మండలం లోని కామన్ పల్లి ప్రాథమిక పాఠశాలలో చిన్నారుల కోసం నూతనంగా ఏర్పాటు చేసిన ప్రీ-ప్రైమరీ తరగతులను గ్రామ సర్పంచ్ ఢ సర్పంచుల ఫోరమ్ మండల అధ్యక్షుడు పేరం శ్రీనివాస్ రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ..ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంలో భాగంగా,చిన్నారులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రీ-ప్రైమరీ తరగతులను అందుబాటులోకి తీసుకురావడం సంతోషకరమని అన్నారు. అంగన్‌వాడీలకు దీటుగా,ప్రభుత్వ పాఠశాలల్లోనే అత్యాధునిక వసతులతో విద్యను అందించడం వల్ల పేద విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించి ప్రోత్సహించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్,ఉపాధ్యాయ బృందం షఫీక్,గోవింద్ నాయక్,గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

## గోదావరి నదిలో మునిగి ఐదుగురు జాలర్లు మృతి!

**మన దునియా,హైదరాబాద్:జులై 18**

తెలంగాణ ఆంధ్ర సరిహద్దుల్లో శని వారం విషాద ఘటన చోటు చేసుకుంది, చేపల వేటకు వెళ్ళిన ముగ్గురు మహిళలు, ఇద్దరు పురుషులు గోదావరి నదిలో గల్లంతయ్యారు. వీరిలో ఇద్దరి మృత దేహాలను వెలికి తీయగా.. గల్లంతయి న వారి కోసం గాలిం పు చర్యలు చేపడు తున్నారు. పోలవరం జిల్లా ఎటపాక మండలం గొమ్ముకొత్తగూడెం గ్రామానికి చెందిన 11 మంది జాలరులు గొల్లగూడెం వద్ద గల గోదావరి వద్దకు చేపల వేటకు వెళ్లా రు. నదిలో దిగిన వారికి లోతు తెలి యక బసిబోయిన బాలరాజు(38), ఊయిక రమేష్(38), తుర్రం భారతి (40), ఊయిక లక్ష్మి (37),ఊయిక సుశీల (37) లు గోదావరిలో గల్లంతయ్యారు. సమాచారం అందు కున్న స్థానికులు, పోలీస్ అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని గల్లంతైన వారికోసం గాలింపు చర్యలు చేపట్టారు. గల్లంతైన ఐదుగురు కోసం గాలించగా రెండు మృతదేహాలు లభ్యమయ్యాయి. గొమ్ముకొత్తగూడానికి చెందిన ఐదుగురు మృతి చెందడంతో ఆ గ్రామంలో విషాద ఛాయలు అలుము కున్నాయి.



మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం

## తెలంగాణలో రానున్న 24 గంటల్లో భారీ వర్షాలు!

**మన దునియా,హైదరాబాద్:జులై 18**



బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లో వాతావర ణం ఒక్కసారిగా మారిపోయింది. రాగల 24 గంటల్లో తెలంగాణలోని పలు జిల్లాల్లో 5,6 రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. ముఖ్యంగా ఆసిఫా బాద్, మంచిర్యాల, జయశంకర్ భూపా లపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్, హనుమ కొండ, జనగాం, సిద్దిపేట, మెదక్, కామారెడ్డి,తో పాటు.. రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, కామారెడ్డి, జిల్లాలో నూ అక్కడ క్కడా అత్యంత భారీ వర్షాలు పడతాయని వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ జిల్లాల్లో వర్ష తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున అధికా రులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుం టున్నారు. కాగా, రాష్ట్రంలోని మిగిలిన జిల్లాల్లో మోస్తరు నుంచి తేలికపాటి వానలు కురిసే అవకాశం ఉందని స్పష్టం చేశారు.

## త్వరలో క్యూఆర్ కోడ్ తో కొత్త రేషన్ కార్డులు!

**మన దునియా,హైదరాబాద్:జులై 18**




తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి రాగానే కొత్త రేషన్ కార్డులపై దృష్టి పెట్టింది, అందుకు అనుగుణంగా లబ్ధి దారులకు కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవు తోంది. రాష్ట్రవ్యాప్తం గా 1.05 కోట్లకు పైగా కుటుంబాల కోసం క్యూఆర్ కోడ్‌తో రూపొందించిన రేషన్ కార్డుల ప్రింటింగ్ ఇ ప్పటికే పూర్తయింది. ఈ కొత్త కార్డులను ఆయా జిల్లాలకు సైతం అధికార యం త్రాంగం చేరవేసింది. కార్డుల పంపిణీ తేదీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఖరారు చేయడమే మిగిలి ఉంది. సీఎం నిర్ణ యం తీసుకోగానే, ఆ తేదీ నుంచి స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేయను న్నట్లు పౌర సరఫ రాల శాఖ వర్గాలు చెబుతున్నాయి.ఈ కొత్త స్మార్ట్‌రేషన్ కార్డులను క్రెడిట్, డెబిట్ కార్డు సైజులో తయారు చేశారు. ఫొటోపై కార్డు యజ మాని పేరు, అడ్రస్?లు ఉంటాయి. సీఎం రేవంత్ రెడ్డి, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమా ర్ రెడ్డి, ఫొటోలను కార్డుపై ముద్రించి నట్లు సమాచారం. ప్రస్తుతం రేషన్ కార్డులు కాగితం రూపంలో ఉన్నాయి. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఆవిర్భావం తర్వాత కార్డు రూపంలో రేషన్ కార్డులు రానుండటం ఇదే తొలిసారి. కార్డుపై క్యూఆర్ కోడ్ ముద్రించి ఉంటుంది. ఆ కోడ్‌ను స్కాన్ చేస్తే రేషన్ లబ్ధిదారులైన ఆ కుటుంబ సభ్యుల వివరాలతో పాటు ఇప్పటి వరకు బియ్యం, చక్కెర, గోధుమలు వంటి రేషన్ వస్తువుల్ని తీసుకున్న పూర్తి వివరాలు కనిపిస్తాయి.

## ఉపాధ్యాయుల లైంగిక వేధింపులు

**బాన్సువాడ మండలంలోని ఆదర్శ పాఠశాలలో ఘటన...**

**ఇద్దరు ఉపాధ్యాయులను విధుల నుంచి తొలగింపు...**

**ఉమ్మడి నిజామాబాద్ జిల్లా.: ప్రతినిధి, మన దునియా:**



బాన్సువాడ మండలంలోని ఓ ఆదర్శ పాఠశాలలో పనిచేస్తున్న ఇద్దరు ఉపాధ్యాయులు విద్యార్థినిలపై లైంగిక వేధింపులు చేసిన ఘటన కలకలం రేపింది. పాఠశాల ఉపాధ్యాయులపై వచ్చిన ఫిర్యాదులు కలకలం రేపాయి. పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న గోపాల్, పవన్ అనే ఇద్దరు ఉపాధ్యాయులు విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో పాటు లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారని విద్యార్థినులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన విద్యాశాఖ అధికారులు విచారణ చేపట్టారు. విచారణలో విద్యార్థినుల ఆరోపణలు నిజమేనని తేలడంతో వారిద్దరిని విధుల నుంచి శాశ్వతంగా తొలగించినట్లు జిల్లా విద్యాధికారి మల్లికార్జున్ తెలిపారు. అలాగే విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు బాన్సువాడ పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణ చేపడుతున్నారు.విద్యాసంస్థల్లో విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, ఇలాంటి ఘటనలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని అధికారులు పేర్కొన్నారు.

## 20వ తేదీ నాటి ప్రజావాణి కార్యక్రమం రద్దు. ప్రకటనలో వెల్లడించిన కలెక్టర్.

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి మన దునియా:**



ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ప్రధాన సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు వేయడం జరిగిందని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఒక ప్రకటనలో తెలిపారు. కీలక అంశాలపై ఉమ్మడి జిల్లా సమీక్షా సమావేశం ఉండడంతో ఈ నెల 20న జరగాల్సిన ప్రజావాణిని రద్దు చేశామని అన్నారు. ఈ నెల 27వ తేదీ నుంచి తిరిగి యధావిధిగా ప్రతి సోమవారం ప్రజావాణి కొనసాగుతుందని తెలిపారు.

# దుబ్బగూడెంగ్రామంలో అనుమానాస్పద స్థితిలో యువకుడి హత్య





**మన దునియా, వాజేడు ,జులై 18**



ములుగు జిల్లా వాజేడు మండలం కృష్ణాపురం గ్రామపంచాయతీ లోని దుబ్బగూడెం గ్రామంలో అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి చెందారు పేరూరు పోలీస్ స్టేషన్ పరిధిలో గల దుబ్బ గూడెం గ్రామానికి చెందిన మడే చలపతి అను వ్యక్తి తన ఇంటిలో పడుకొని నిద్రిస్తుండగా సుమారు అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు మొఖంపై మెడపై తలపై కత్తి గొడ్డలి లాంటి పదునైన ఆయుధాలతో నరకడంతో గాయాలతో రక్తం మడుగులో చనిపోయి ఉన్నాడు మృతుడీ కుటుంబ సభ్యులు తండ్రి మడే మదనయ్య ,తల్లి రాధా, మృతి చెందిన వ్యక్తి కి నలుగురు అక్కలు, మడే ఆదిలక్ష్మి పూనెం శేసమ్మ, వాసం అనసూర్య, వాసం కళావతి, ఉన్నారు మృతుడు చలపతికి మరియు అతని అక్క ఆదిలక్ష్మి కి ఇంకా వివాహం కాలేదని ని వారిద్దరూ వారి తల్లిదండ్రులతో కలిసి దుబ్బగూడం గ్రామంలో ఒకే ఇంట్లో ఉన్నారని గత కొంతకాలంగా తల్లిదండ్రులతో కలిసి దుబ్బ గూడెం గ్రామంలో ఒకే ఇంట్లో నివసిస్తున్నారని మృతుడు గత కొంతకాలంగా మధ్యానికి బానిసై ఏ పని చేయకుండా రోజు తాగుతూ జులాయిగా తిరుగుతూ నిత్యం ఇంట్లో వాళ్ళని తిడుతూ కొడుతూ వేధించేవాడని రోజు లాగానే నిన్న ది.17. 07. 2026 నా రాత్రి త్రాగి ఇంటికి వచ్చి పడుకున్నాడు ది. 18. 07. 2026 నా ఉదయం పడుకున్నవాడు ఇంకా లేవలేదని చూడగా అతని ముఖంపై మరియు తల పైన మెడ పైన ఏదో పదునైన ఆయుధంతో నరికి చంపినట్లు తీవ్రమైన గాయాలతో రక్తం మడుగులో చనిపోయి మంచంలో కనిపించినారు ఇట్టి విషయం పైన పేరూరు ఎస్సై కృష్ణ ప్రసాద్, కేసు నమోదు చేసి పై అధికారులకు సమాచారం ఇవ్వగా వెంకటాపురం సిఐ క్లు టీం తో అన్ని కోణాలలో దర్యాప్తు జరుపుతున్నారు అంతకులు ఎవరు అనేది తెలియాల్సి ఉంటుంది కాగా గ్రామస్తులు కుటుంబ సభ్యులే మృతిని ఆగడాలు తట్టుకోలేక చంపి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు



# విద్యార్థినులపై లైంగిక వేధింపులు... ఇద్దరు ఒప్పంద ఉపాధ్యాయుల పై వేటు

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి మన దునియా::**

కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలంలో విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించి ఉన్నత స్థాయికి చేర్చాల్సిన కొందరు ఉపాధ్యాయులే కీచకుళ్ళ మరి దారి తప్పుతున్నారు. విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారు. ఇలాంటి ఘటనల కారణంగా తల్లిదండ్రుల్లో ఆందోళన ఏర్పడుతోంది.బాన్సువాడ మండలంలో.. ఓ పాఠశాలలో పనిచేస్తున్న ఇద్దరు ఒప్పంద ఉపాధ్యాయులపై వచ్చిన ఫిర్యాదులు కలకలం సృష్టించాయి పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న గోపాల్, పవన్ అనే ఇద్దరు ఒప్పంద ఉపాధ్యాయులు విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో పాటు లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారని విద్యార్థినులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన విద్యాశాఖ అధికారులు విచారణ చేపట్టారు. విచారణలో విద్యార్థినుల ఆరోపణలు నిజమేనని తేలడంతో వారిద్దరిని విధుల నుంచి శాశ్వతంగా తొలగించినట్లు జిల్లా విద్యాధికారి మల్లికార్జున్ తెలిపారు. అలాగే విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు పోలీసులు కేసు నమోదు చేసే ప్రక్రియను ప్రారంభించినట్లు సమాచారం. విద్యాసంస్థల్లో విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, ఇలాంటి ఘటనలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని అధికారులు అంటున్నారు




# ఒత్తిడిని తగ్గించుకోవాలంటే ఏం చేయాలో తెలుసా?

ఈ రోజుల్లో ఉద్యోగ రీత్యా లేదా ప్రేమ, డబ్బు లేదా ఫ్యామిలీ పరంగా ఏదయినా కారణం చేత చాలామంది టెన్షన్ లేదా ఒత్తిడికి గురవుతారు. దీని వలన మన మానసిక ఆరోగ్యం దెబ్బతింటుంది. ప్రతి చిన్న దానికి ఎక్కువగా ఆలోచించడం వలన కూడా టెన్షన్, ఒత్తిడి వంటివి పెరుగుతాయి. మనం ఇతరులతో ఎలా మాట్లాడాలి వారు మనకు ఎలా స్పందిస్తారో ముందుగా ఊహించుకొని మనం అనుకున్న అంచానాలు రీచ్ అవ్వకపోయినా ఒత్తిడికి గురవుతారు. కాబట్టి మనం ప్రతి విషయంలో ఎలా జరిగిన దానిని స్వీకరించగలగాలి అంతేగాని దాని గురించి ఆలోచిస్తూ ఉండకూడదు. మన మూడ్ సరిగ్గా లేకపోయిన ఆ సమయంలో మనం తీసుకునే నిర్ణయాలు చెడుగా ఉంటాయి. దీని వలన మనం అవతలివారిలో నెగిటివిటీ ని పెంచిన వారమవుతాము. తరువాత మనం వారు మన గురించి ఏమి ఆలోచిస్తున్నారో అని అనుకుంటూ ఉంటాము ఇలా ఆలోచనలతో ఒత్తిడికి గురవుతాము. కాబట్టి మన మూడ్ బాగోలేనప్పుడు ఎటువంటి నిర్ణయాలు తీసుకోకపోవడమే మంచిది. లావుగా ఉన్నామని లేదా సన్నగా ఉన్నామని లేదా ఏదయినా మానసిక, శారీరక సమస్య వచ్చినా కొందరు చాలా బాధపడుతుంటారు. అంతే కానీ సమస్యకు పరిష్కారం వెతకరు. కాబట్టి మనం ఏదయినా సమస్య వచ్చినప్పుడు బాధపడకుండా దానికి పరిష్కారం వెతకాలి. ఈ మధ్య చాలామంది దానిలోనే సినిమాలు, సీరియళ్లు, షోస్ చూస్తున్నారు కాబట్టి దీని వలన మనం ఎక్కువ సమయం స్క్రీన్ మీద గడుపుతున్నారు. దీని వలన మెంటల్ హెల్త్ ఇష్యూస్ వచ్చే అవకాశం ఉంది. కాబట్టి మనం లో సినిమాలు, సిరీస్ లు చూసేటప్పుడు మధ్యమధ్యలో బ్రేక్ ఇస్తూ ఉండాలి దాని వలన మన ఆరోగ్యానికి మంచిది. ఒత్తిడి వలన మనకు గుండె సమస్యలు, ఆస్తమా, హైపర్ టెన్షన్, జుట్టు రాలడం వంటి సమస్యలు వస్తాయి. ఒత్తిడిని, టెన్షన్ ను తగ్గించుకోవడానికి మనం మొదట ఎక్కువగా ఆలోచించడం తగ్గించు కోవాలి. ఇంకా యోగా, ధ్యానం వంటివి చేస్తూ ఉండాలి. వీటి వలన రిలీఫ్ గా ఉంటుంది.



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం
జులై | ఆదివారం | 19 | 2026


# మూడు వారాలలో 559 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు. 52 లక్షల 80 వేల రూపాయల జరిమానా,31 మందికి వారం రోజుల జైలు శిక్ష. పోలీస్ కమిషనర్ సాయి చైతన్య వెల్లడి.

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి మన దునియా:**

నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో అన్ని లా అండ్ ఆర్డర్,ట్రాఫిక్ పి.ఎస్ లలో గడిచిన 3 వారాలలో డ్రంకన్ డ్రైవ్ లో 559 మంది పట్టు బడగా వారిని నిజామాబాద్, బోధన్, అర్మూర్ కోర్టులలో వారిని హాజరు పర్చగా 31 మందికి వారం రోజుల పాటు జైలు శిక్ష విధించడం జరిగిందని పోలీస్ కమిషనర్ సాయి చైతన్య వెల్లడించారు. వారికి 52 లక్షల 80 వేల రూపాయలు జరిమానా విధించినట్లు తెలిపారు. కమిషనరేట్ పరిధిలో చేసిన తనిఖీలలో అధిక మొత్తములో త్రాగి వాహనములు నడిపి పట్టుబడటం పోలీసులకు పట్టుబడినట్లు తెలిపారు. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ సమీపాలలో వారి వారి పోలీస్ స్టేషన్ పరిధిలలో వాహనాల తనిఖీలు నిర్వహించడం జరుగుతోంది. ఇందులో భాగముగా గత నెల 29వ తేదీ నుండి ఈనెల 17వ తేదీ వరకు వాహన తనిఖీలు నిర్వహించగా ఇందులో మొత్తం 559 కేసుల నమోదు చేయడం జరిగిందన్నారు.నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య క్రింది నిబంధనలు పాటించాలన్నారు.ప్రజలు మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు.వాహనాదారులు వాహనానికి సంబంధించినటువంటి పత్రములు సక్రమముగా తమ వద్ద ఉంచుకోగలరు.డ్రంకన్ డ్రైవ్లో పట్టుబడిన వారి లైసెన్స్ 6 నెలల పాటు సస్పెండ్ చేయడం జరుగుతుందన్నారు.మద్యం త్రాగి వాహనం నడిపి అనుకోని రోడ్డు ప్రమాదం జరిగినట్లయితే ఇన్సూరెన్సు లభించదన్నారు. మైనర్లు తాగి వాహనం నడిపి పోలీస్ వారికి దొరికినట్లైతే మైనర్ వెహికల్ ఓనర్ పైన ఛార్జ్ షీట్ నమోదు చేయబడునని,అలాగే జైలు




శిక్ష విధించే అవకాశం ఉంటుందన్నారు.ఒక సారి కంటే ఎక్కువ సార్లు పట్టుబడినట్లయితే జైలు శిక్ష విధించబడుతు0దన్నారు.మోటర్ వెహికల్ యాక్ట్ 1989 (చట్టం సవరణ 2019) అమలులో ఉన్నందున డ్రంక్ అండ్ డ్రైవ్ లో మొదటిసారి పట్టుబడినట్లయితే 10,000/- జరిమానా లేదా ఆరు నెలల జైలు శిక్ష లేదా జరిమానా తో పాటు జైలు శిక్ష విధించబడును. అలాగే డ్రంక్ అండ్ డ్రైవ్ లో రెండోసారి పట్టుబడినట్లైతే 15,000/- జరిమానా లేదా జైలు శిక్ష లేదా జైలు శిక్షతో పాటు జరిమానా విధించడం జరుగుతుందన్నారు. వీటిని దృష్టిలో పెట్టుకొని వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తూచా తప్పకుండా పాటించాలని సీపీ సాయి చైతన్య సూచించారు.

# లోలం బ్రిడ్జి వద్ద చిరుత సంచారం.

**ఆందోళనలో అయా గ్రామాల ప్రజలు**

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి మన దునియా:**




ఇందల్వాయి మండలం లోలం- మల్లాపూర్ బ్రిడ్జి వద్ద చిరుత సంచారం స్థానికులను కలవరపాటుకు గురి చేసింది. శుక్రవారం రాత్రి ధర్పల్లి కి చెందిన కొందరు లోలం బ్రిడ్జి వద్ద చూసి భయాందోళనకు గురయ్యారు. డిచ్ పల్లి-మిట్టపల్లి నుంచి లోలం- ఎల్లారెడ్డి పల్లె వైపు వచ్చేవారు రాత్రివేళ బ్రిడ్జి వద్ద జాగ్రత్త అంటూ సోషల్ మీడియాలో పోస్టులు చేశారు. లోలం బ్రిడ్జి వద్ద చిరుత సంచారం వాస్తవమేనని ఇందల్వాయి రేంజ్ అటవీ అధికారి రవి మోహన్ భట్ తెలిపారు. శనివారం ఉదయం ఆటవి శాఖ సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించారు అన్నారు. ఇటివల ఇందల్వాయి మండలం ఎల్లారెడ్డి పల్లి శివారులో సంచరించిన చిరుత నే స్థానికంగా తిరుగుతుందని అనుమానిస్తున్నారు.

# భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలి











**గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై డీజీపీ మహేష్ భగవత్ వీడియో కాన్ఫరెన్స్**

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి మన దునియా:**

రానున్న గోదావరి పుష్కరాల నేపథ్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖల సమన్వయంతో పటిష్ట ఏర్పాట్లు చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర డీజీపీ (లా అండ్ ఆర్డర్) మహేష్ భగవత్ అధికారులను ఆదేశించారు. పుష్కరాల నిర్వహణకు సంబంధించి చేపట్టాల్సిన భద్రతా చర్యలపై గోదావరి పరివాహక ప్రాంత జిల్లాల ఎస్పీలు, పోలీస్ కమిషనర్లతో డీజీపీ శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఘాట్ల వద్ద భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, భక్తుల రద్దీ నిర్వహణ, పార్కింగ్ ఏర్పాట్లు, క్యూలైన్ వ్యవస్థ, అత్యవసర సేవలు, విపత్తు నిర్వహణ, డ్రోన్ నిఘా, సీసీ కెమెరాల పర్యవేక్షణ, కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ల పనితీరు వంటి అంశాలపై సమీక్షించారు.పుష్కరాల సందర్భంగా లక్షలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ముందస్తు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకుని, అన్ని శాఖలతో సమన్వయంతో పనిచేయాలని డీజీపీ సూచించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి ఘాట్ వద్ద తగిన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు మహిళల భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, తప్పిపోయిన వారి కోసం సహాయ కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. భక్తులకు మార్గదర్శకాలు స్పష్టంగా కనిపించేలా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులకు తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, అదనపు డీసీపీ (అడ్మిన్) ఎన్. శుభం ప్రకాష్, నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ ఏసీపీలు ప్రకాష్ యాదవ్, వెంకటేశ్వర్ రెడ్డి, శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్ పెక్టర్ లు శ్రీధర్ రెడ్డి, మల్లేష్, బోధన్ రూరల్ సీఐ విజయబాబు, రెంజల్ ఎస్సై గంగాధర్, నవీపేట్ ఎస్సై శ్రీకాంత్, పోలీస్ కార్యాలయ సూపరింటెండెంట్ శంకర్, ఐటీ కోర్ సిబ్బంది.

# రాష్ట్ర ప్రభుత్వానికి జిపిఓల అధ్యక్షుడు ప్రత్యేక కృతజ్ఞతలు

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి మన దునియా**

నిజామాబాద్ జిల్లా నగరంలోని సుభాష్ నగర్ లోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో మీడియా సమావేశంలో జిపిఓ జిల్లా అధ్యక్షుడు భూమయ్య, సాయినాథ్, మాట్లాడుతూ జూలై 15 నుంచి కొత్త హెల్త్ కార్డులతో క్యాష్‌లెస్ వైద్య సేవలు ప్రారంభంరాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు మరియు వారి కుటుంబ సభ్యులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం నూతనఎంప్లాయ్ హెల్త్ కేర్ ట్రస్ట్ ఆరోగ్య పథకాన్ని నిన్నటి రోజు అధికారికంగా ప్రారంభించింది.డా. బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి మరియు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ముఖ్య అతిథిగా, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నర్సింహ పాల్గొని లిలి హెల్త్ పోర్టల్ లిలిను ప్రారంభించి నూతన హెల్త్ కార్డులను విడుదల చేశారు.ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి శ్రీ భట్టి విక్రమార్క మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర చరిత్రలో ఉద్యోగుల సంక్షేమానికి ఇది ఒక నూతన అధ్యాయమని, ఈ పథకం ద్వారా 8 లక్షల మంది ఉద్యోగులు, 9.8 లక్షల మంది వారి కుటుంబ సభ్యులకు ఆరోగ్య భద్రత కల్పిస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి "ఆరోగ్య తెలంగాణ" లక్ష్యానికి అనుగుణంగా ఈ పథకాన్ని రూపొందించినట్లు పేర్కొన్నారు.రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నర్సింహ మాట్లాడుతూ, దాదాపు రెండు దశాబ్దాల తరువాత ఉద్యోగులకు మరింత మెరుగైన ఆరోగ్య సేవలను ఈ హెచ్ టిద్వారా అందించడం ఒక మైలురాయని, ఎలాంటి అపోహలకు తావులేకుండా ప్రతి ఉద్యోగి కుటుంబానికి ఈ పథకం ప్రయోజనం చేకూరేలా పారదర్శకంగా అమలు చేస్తామని తెలిపారు.ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మరియు ఈ హెచ్ సి టి బోర్డు చైర్మన్ సంజయ్ జాజు, ఐఏఎస్ ప్రారంభోపన్యాసంలో మాట్లాడుతూ, ఉద్యోగుల వివరాలను హెల్త్ హోటల్తో అనుసంధానం చేశామని, మొదటి దశలో 354 అనుబంధ ఆసుపత్రులు, 17ఎన్ ఎ, బి హెచ్ గుర్తింపు పొందిన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు ఈ పథకంలో భాగమయ్యాయని తెలిపారు. జూలై 31 నాటికి మరో 532 ఆసుపత్రులను చేర్చి మొత్తం 886 అనుబంధ ఆసుపత్రులతో సేవలు అందిస్తామని, అదనంగా 24 వెల్‌నెస్ సెంటర్లు ప్రారంభిస్తామని వెల్లడించారు

ఉద్యోగులకు ముఖ్య సమాచారం:

జూలై 15 నుంచి కొత్త హెల్త్ కార్డులతో క్యాష్‌లెస్ వైద్య సేవలు ప్రారంభం

ద్వారా కొత్త హెల్త్ కార్డులను వినియోగించుకునే అవకాశం

దశలవారీగా మొత్తం 886 అనుబంధ ఆసుపత్రుల్లో వైద్య సేవలు

అదనంగా 24 వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు.

నిజామాబాద్ జిల్లా జిపిఓ సంఘ అధ్యక్షుడు:బియ్య సాయినాథ్

ప్రధాన కార్యదర్శి: గున్నం సంతోష్

కోశాధికారి :భూమేశ్

మహిళా అధ్యక్షురాలు:గంగా భవాని


ఉపాధ్యక్షులు: నీరడి రమేష్ ,మోహన్,రాజేశ్వర్,సుధాకర్, యుగేందర్, అఫ్రోజ్, సుమన్ ,గంగాధర్, భూపాల్ ,నరేందర్, రాజేష్ అరుణ,హరిచరన్ జిల్లా జిపిఓ హర్షం వ్యక్తం చేశారు



## బీజేపీలో విభేదాలకు ఫుల్‌స్టాప్.. లక్ష్మణ్ నివాసంలో కీలక భేటీ

**మన దునియా,హైదరాబాద్:జులై 18**

హైదరాబాద్‌లో బీజేపీ ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్ నివాసంలో జరిగిన కీలక సమావేశం ముగిసింది. పార్టీ తెలంగాణ ఇన్‌చార్జ్ అభయ్ పాటిల్, కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీ ఈటల రాజేందర్‌తో సమావేశమై పార్టీ వ్యవహారాలపై చర్చించారు. ఈ సందర్భంగా నేతల మధ్య నెలకొన్న విభేదాలకు అభయ్ పాటిల్ రాజీ కుదిర్చినట్లు సమాచారం. అనంతరం మీడియాతో మాట్లాడిన లక్ష్మణ్.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. రాష్ట్రంలో కాంట్రాక్టర్లు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి నెలకొందని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనపై ప్రజలు విసిగిపోయారని, తెలంగాణలో బీజేపీకి అనుకూల వాతావరణం ఏర్పడుతోందని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధికి ప్రధాని నరేంద్ర మోదీ ప్రత్యేక చొరవ చూపుతున్నారని పేర్కొన్నారు. బీజేపీలో నేతల మధ్య ఎలాంటి విభేదాలు లేవని, పార్టీ ఐక్యంగా ముందుకు సాగుతుందని లక్ష్మణ్ స్పష్టం చేశారు.



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం

# ప్రజాస్వామ్యానికి ఓటే బలం..!

- ఎస్ఐఆర్‌ను నిర్లక్ష్యం చేయొద్దు:బీజేపీ మహిళా మోర్చా ములుగు జిల్లా అధ్యక్షురాలుకొర్ర సుమలత
- ప్రతి అర్హ ఓటరు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- ఆగస్టు 3 వరకు గడువు పొడిగింపు

**మన దునియా,ములుగు జిల్లా: జులై 18**





ములుగు: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రతి పౌరుడికి అత్యంత విలువైన రాజ్యాంగబద్ధమైన హక్కు అని, ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను అర్హులైన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ మహిళా మోర్చా ములుగు జిల్లా అధ్యక్షురాలు కొర్ర సుమలత పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ఓటరు జాబితాలో పేరు నమోదు, మార్పులు, చేర్పులు, సవరణల విషయంలో నిర్లక్ష్యం చేస్తే ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజల అభిప్రాయాన్ని తెలియజేసే అత్యంత శక్తివంతమైన ఆయుధం ఓటేనని, అందుకే ప్రతి అర్హ ఓటరు తమ ఓటు వివరాలను పరిశీలించి అవసరమైన సవరణలు చేసుకోవాలని సూచించారు. బీఎల్‌వోలు, బీఎల్ఏలు పరస్పర సమన్వయంతో ప్రతి అర్హ ఓటరిని గుర్తించి నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు. ప్రజలు కూడా అలసత్వం ప్రదర్శించకుండా ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ నెల 24తో ముగియాల్సిన గడువును ప్రభుత్వం ఆగస్టు 3వ తేదీ వరకు పొడిగించిందని, ఈ అదనపు అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని కొర్ర సుమలత పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలంటే ప్రతి అర్హ పౌరుడు ఓటరు జాబితాలో తన పేరు ఉండేలా చూసుకోవడం అత్యంత అవసరమని ఆమె పేర్కొన్నారు.

# సెలబ్రిటీల మెరుపు మీ సొంతం.. గ్లోయింగ్ స్కిన్ కోసం కొన్ని చిట్కాలు

సెలబ్రిటీలలా మెరిసిపోయే చర్మ సౌందర్యం పొందాలని చాలామంది మహిళలు కోరుకుంటారు. అయితే అది కేవలం కొందరికే సాధ్యమని అనుకుంటే పొరపాటే. సరైన జాగ్రత్తలు, కాస్త సమయం కేటాయిస్తే ఎవరైనా సరే సహజమైన, ఆరోగ్యకరమైన గ్లోయింగ్ స్కిన్ పొందవచ్చని సౌందర్య నిపుణులు చెబుతున్నారు. డెర్మటాలజిస్టులు, మేకప్ ఆర్టిస్టులు మెరిసే చర్మం కోసం పాటించాల్సిన కొన్ని ముఖ్యమైన చిట్కాలను పంచుకున్నారు. ఆరోగ్యకరమైన చర్మం కోసం ఒక్కటే మంత్రం అంటూ ఏదీ లేదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. మంచి ఆహారం, తగినంత నిద్ర, ఒత్తిడిని తగ్గించుకోవడం, సరైన స్కిన్‌కేర్ రొటీన్ పాటించడం వంటివి చాలా అవసరం. ముఖ్యంగా కొన్ని అలవాట్లను దినచర్యలో భాగం చేసుకోవడం ద్వారా చర్మంలో స్పష్టమైన మార్పు చూడవచ్చని వారు వివరిస్తున్నారు.

**నిపుణులు సూచిస్తున్న కొన్ని ముఖ్యమైన చిట్కాలు:**

ఎస్పీఎఫ్ తప్పనిసరి: చర్మానికి 90% నష్టం సూర్యరశ్మి వల్లే కలుగుతుంది. అందుకే వాతావరణంతో సంబంధం లేకుండా ప్రతిరోజూ బ్రాడ్ స్పెక్ట్రమ్ ఎస్పీఎఫ్ (ఫ్రాఖీ) 50 ఉన్న సన్‌స్క్రీన్ వాడటం తప్పనిసరి. ఇంట్లో ఉన్నప్పుడు కూడా కిటికీల నుంచి వచ్చే యూవీఏ కిరణాల నుంచి ఇది రక్షణ కల్పిస్తుంది. అసలు ఎస్పీఎఫ్ (ఫ్రాఖీ) అంటే సన్ ప్రొటెక్షన్ ఫ్యాక్టర్. ఇది సూర్యుడి నుంచి వెలువడే హానికరమైన యూవీబీ కిరణాల నుంచి మన చర్మానికి ఎంత రక్షణ లభిస్తుందో సూచిస్తుంది. ఉదాహరణకు, ఎస్పీఎఫ్ 50 రాసుకుంటే, సాధారణం కంటే 50 రెట్లు ఎక్కువ సమయం చర్మం సురక్షితంగా ఉంటుందని అర్థం. తేమ (మాయిశ్చర్) కీలకం: చర్మం పొడిబారినట్లు అనిపిస్తే, హైల్యూరోనిక్ యాసిడ్ ఉన్న సీరమ్ లేదా మాయిశ్చరైజర్ వాడాలి. ఇది నీటిని ఆకర్షించి చర్మాన్ని లోపలి నుంచి తేమగా, కాంతివంతంగా మారుస్తుంది. ఆహారం, వ్యాయామం: ఆహారంలో యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉండే కూరగాయలు, పండ్లు చేర్చుకోవాలి. అలాగే, రోజూ చేసే వ్యాయామం రక్త ప్రసరణను మెరుగుపరిచి చర్మానికి సహజమైన నిగారింపును ఇస్తుంది. మద్యపానానికి దూరంగా ఉండటం వల్ల చర్మం డీహైడ్రేట్ కాకుండా ఉంటుంది. యాక్టివ్ ఇంగ్రీడియంట్స్: చర్మం నిస్తేజంగా, డల్‌గా కనిపిస్తే రెటినాల్ (విటమిన్ ఎ) వాడకం మేలు చేస్తుంది. ఇది కొత్త కణాల ఉత్పత్తిని ప్రోత్సహించి చర్మాన్ని తాజాగా మారుస్తుంది. అయితే, దీనిని నిపుణుల సలహా మేరకు తక్కువ మోతాదుతో ప్రారంభించాలి. ఈ చిట్కాలతో పాటు తగినంత నిద్ర, ఒత్తిడిని జయించడం వంటివి పాటిస్తే చర్మం సహజంగానే ఆరోగ్యంగా, కాంతివంతంగా మారుతుందని నిపుణులు భరోసా ఇస్తున్నారు.



# గూడెం జడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ





**పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ**

**మన దునియా, జులై 18,మంచిర్యాల జిల్లా**

మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం గూడెం జడ్పీహెచ్ఎస్ హైస్కూల్‌లో విశాఖ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్కూల్ బ్యాగులను పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, అదనపు కలెక్టర్ చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఎంపీకి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎంపీ వంశీకృష్ణ మాట్లాడుతూ, గత కొన్ని సంవత్సరాలుగా పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో విశాఖ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ స్ఫూర్తితో తమ తాత కాకా వెంకటస్వామి ఈ ట్రస్ట్‌ను స్థాపించారని గుర్తుచేశారు. గూడెం జడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులు బెంచీలు లేక ఇబ్బందులు పడుతున్న విషయం తనను బాధించిందని, త్వరలోనే ఈ పాఠశాలకు అవసరమైన బెంచీలను అందజేస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చదువుకునే వాతావరణం కల్పించేందుకు కృషి చేస్తామని చెప్పారు. ప్రతి విద్యార్థి బాగా చదివి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని ఆకాంక్షించారు. కార్యక్రమం అనంతరం ఎంపీ విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. మీడియాతో ఎంపీ వంశీకృష్ణ వ్యాఖ్యలు ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన ఎంపీ గడ్డం వంశీకృష్ణ, గూడెం జడ్పీహెచ్ఎస్‌లో స్కూల్ బ్యాగుల పంపిణీ కార్యక్రమానికి వస్తుండగా కొందరు కాంగ్రెస్ నాయకులు అడ్డుకునే ప్రయత్నం చేయడం బాధాకరమని అన్నారు. రాజకీయాల్లో విభేదాలు సహజమే అయినప్పటికీ, ప్రజల అభివృద్ధి విషయంలో అందరూ కలిసి పనిచేయాలని సూచించారు. గతంలో గూడెం ఆలయ అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమంలో కూడా తనకు మాట్లాడే అవకాశం ఇవ్వలేదని గుర్తు చేశారు. అయితే అలాంటి విషయాలను తాను పట్టించుకోనని, ప్రజల అభివృద్ధి కోసం అందరూ కలిసి పనిచేయడమే తన ఆకాంక్ష అని ఎంపీ గడ్డం వంశీకృష్ణ తెలిపారు.

# ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో ప్రత్యామ్నాయ ప్రణాళికలు రూపొందించాలి.





**వీడియో కాన్ఫరెన్స్ లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు.**

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి మన దునియా:**

ఎల్ నినో కారణంగా రాష్ట్రంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ ప్రణాళికల రూపకల్పనకు చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సూచించారు. శనివారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల స్పెషల్ ఆఫీసర్లు, కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా తాగునీరు, సాగునీరు, విద్యుత్ రంగాల్లో తీసుకోవలసిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. ఈ నెల 20న జిల్లా ఇంచార్జి మంత్రి నేతృత్వంలో నిర్వహించే ఉమ్మడి జిల్లా సమావేశంలో ప్రస్తుతం నెలకొని ఉన్న పరిస్థితులపై చర్చించి, ప్రత్యామ్నాయ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ప్రస్తుత ప్రతికూల పరిస్థితుల్లో అవసరమైన చర్యలు తీసుకోవడానికి అన్ని శాఖలు ముందస్తు ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలని అన్నారు. ఎక్కడా తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని, తగిన చర్యలు తీసుకోవాలని, ప్రజలు నుంచి వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని, విద్యుత్ కోతలు లేకుండా నిరంతర విద్యుత్తు సరఫరా ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టర్ ఇలా త్రిపాఠి, డీఆర్ గీత, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీఆర్డీఓ సాయన్న, జిల్లా వ్యవసాయ అధికారి వీరస్వామి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పిల్లల్లో జింక్ లోపం నష్టాలు...

ప్రతి తల్లిదండ్రులకి వారి పిల్లలే ఒక ప్రపంచంగా భావిస్తూ, వారు పడిన కష్టం వారి పిల్లలు పడకూడదు అంటు,వారికి ఏమి ఇష్టమైతే ఆట వస్తువులు కొనివ్వడం,ఇష్టమైన ఆహారాలను అతిగా ఇవ్వడం, సరైన క్రమశిక్షణలో పెట్టకపోవడం వంటి వాటి వల్ల సమాజానికి ఎంత హాని కలుగుతుందో అంతే మోతాదులో వారి ఆరోగ్యం కూడా దెబ్బతింటుందని గ్రహించలేకపోతున్నారు. పిల్లలకు పోషకాహార లోపాలలో తలెత్తడం వాళ్ళ వారి ఆరోగ్యం రోజురోజుకి క్షీణిస్తోందని వైద్య నిపుణులు కూడా హెచ్చరిస్తూ ఉన్నారు. మరి ముఖ్యంగా 10 మందిలో 6 మంది పిల్లలు జింక్ లోపాలతో బాధపడుతున్నారని,దాని వల్ల చాలా అనారోగ్యాలు కలుగుతాయని హెచ్చరిస్తున్నారు కూడా. రోగనిరోధక వ్యవస్థ దెబ్బ తినడం. : పిల్లలు తినే ఆహారాల్లో జింకు లోపం వల్ల,రోగాలకు కారణమైన బ్యాక్టీరియా మరియు ఫంగస్ తో సైనికుడిలా పోరాడే రోగనిరోధక వ్యవస్థ దెబ్బతింటుందని చాలా పరిశోదనాల్లో కూడా తేలింది. కావున ఇమ్యూన్ సిస్టమ్ సరిగా పని చేసేందుకు జింక్ అధికంగా ఉన్న గుమ్మడి కాయ,గుమ్మడి గింజలు,బాదాం,పాలు, అరటిపండు వంటి ఆహారాలను అధికంగా ఇవ్వడం అలవాటు చేయండి. బ్లడ్ క్లాటింగ్ అవకపోవడం..: పిల్లలు తరుచూ దెబ్బలు తగిలించుకుంటూనే ఉంటారు. కొంతమందికి బ్లడ్ కొంతసేపు వచ్చి,గాయం దగ్గర బ్లడ్ క్లాట్ అవుతుంది. కానీ జింక్ లోపం కలవారికి బ్లడ్ గడ్డ కట్టకుండా,దారాలంగా రక్తం వస్తూనే ఉంటుంది. రక్తహీనత ఏర్పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. కావున పిల్లలకు బ్లడ్ క్లాటింగ్ సక్రమంగా జరగాలంటే జింకు ఉన్న ఆహారాలు ఎక్కువగా ఇవ్వడం చాలా అవసరం.



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం
RNI Number



# రోహిత్ రిటైర్ ప్రచారంలో నిజం లేదు


బీసీసీఐ ప్రధాన కార్యదర్శి దేవజిత్ సైకియా

తొలి రెండు వన్డేల్లో రోహిత్ శర్మ విఫలం అయ్యాడు. దాంతో అతడి రిటైర్మెంట్‌పై వార్తలు జోరుగా వచ్చాయి. మూడో వన్డే చివరిదంటూ కూడా వార్తలు వచ్చాయి. ఇప్పటికే బీసీసీఐ పెద్దలతో రోహిత్ శర్మ సమావేశం అయినట్లు.. వన్డే ప్రపంచకప్ 2027 ప్రణాళికల్లో రోహిత్ శర్మ లేనట్లుగా వార్తలు వచ్చాయి. ఇదే విషయాన్ని రోహిత్ శర్మకు బీసీసీఐ తెలిపినట్లు.. మూడో వన్డే అనంతరం రోహిత్ రిటైర్మెంట్ ప్రకటిస్తాడని వార్తలు వచ్చాయి. అయితే తాజాగా వీటిపై బీసీసీఐ క్లారిటీ ఇచ్చింది.భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్, 'హిట్‌మ్యాన్' రోహిత్ శర్మ వన్డే క్రికెట్‌కు వీడ్కోలు పలకబోతున్నాడంటూ సోషల్ మీడియాలో వస్తున్న వార్తలపై భారత క్రికెట్ నియంత్రణ మండలి స్పష్టత ఇచ్చింది. ఇంగ్లాండ్‌తో లార్డ్స్ వేదికగా జరగనున్న మూడో వన్డే మ్యాచ్ తర్వాత రోహిత్ రిటైర్ అవుతాడంటూ జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి నిజం లేదని బీసీసీఐ ప్రధాన కార్యదర్శి దేవజిత్ సైకియా స్పష్టం చేశారు. మీడియాలో వస్తున్నవన్నీ కేవలం అవాస్తవాలని ఆయన కొట్టిపారేశారు. రోహిత్ శర్మ భవిష్యత్తు గురించి జరుగుతున్న చర్చలపై దేవజిత్ సైకియా పీటీఐ వార్తా సంస్థతో మాట్లాడుతూ.. "ఆదివారం లార్డ్స్‌లో జరిగే మ్యాచ్ రోహిత్ కెరీర్‌లో చివరి మ్యాచ్ కాదు. జట్టు మేనేజ్‌మెంట్ కూడా ఆ దిశగా ఎలాంటి చర్చలు జరపలేదు. రోహిత్ భారత్ తరపున వన్డేల్లో కొనసాగుతాడు. రాబోయే సిరీస్‌లకు కూడా అతడు అందుబాటులో ఉంటాడు" అని తెలిపారు. వన్డే జట్టులో రోహిత్ రెగ్యులర్ సభ్యుడని, సోషల్ మీడియాలో వచ్చే ఊహాగానాలను అభిమానులు నమ్మవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. జట్టు ప్రణాళికల్లో ఉన్నంత కాలం రోహిత్ సేవలు టీమిండియాకు అందుతాయని స్పష్టం చేశారు.మరోవైపు, రోహిత్ శర్మ భవిష్యత్తుకు సంబంధించిన అంతర్గత సమాచారం మీడియాకు లీక్ కావడంపై బీసీసీఐ తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. ఎట్టి పరిస్థితుల్లోనూ జట్టుకు సంబంధించిన విషయాలపై మీడియాతో సంభాషించవద్దని బోర్డు సెలక్టర్లకు గట్టిగా సూచించింది. ఇప్పటికే టెస్టులు, టీ20 ఫార్మాట్లకు వీడ్కోలు పలికిన రోహిత్ శర్మ.. 2027 వన్డే ప్రపంచ కప్ గెలవడమే తన తదుపరి లక్ష్యంగా పెట్టుకున్నాడు. ఇప్పటికే కెప్టెన్‌గా టీ20 వరల్డ్ కప్, ఛాంపియన్స్ ట్రోఫీలను అందించిన రోహిత్, ఆటగాడిగా వన్డే ప్రపంచ కప్‌ను కూడా ముద్దాడాలని చూస్తున్నాడు. అయితే, 40 ఏళ్లకు చేరువవుతున్న రోహిత్ శర్మ స్థానంలో, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్‌ను వన్డే జట్టులో సిద్ధం చేయాలని హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ భావిస్తున్నట్లు ప్రచారం సాగింది. దీనికి తోడు గత రెండు వన్డే మ్యాచ్‌ల్లో రోహిత్ పెద్దగా రాణించకపోవడంతో, గంభీర్–రోహిత్ మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయని, అందుకే లార్డ్స్ వన్డే తర్వాత రోహిత్ వీడ్కోలు పలుకుతాడని ఊహాగానాలు జోరందుకున్నాయి. ప్రస్తుతానికి బీసీసీఐ ఇచ్చిన వివరణతో రోహిత్ భవిష్యత్తుపై అభిమానుల్లో ఉన్న అనుమానాలన్నీ పటాపంచలయ్యాయి.




# జపాన్ ఓపెన్‌లో చరిత్ర సృష్టించిన పీవీ సింధు

భారత బ్యాడ్మింటన్ స్టార్, తెలుగు తేజం పీవీ సింధు జపాన్ ఓపెన్ సూపర్–750 టోర్నీలో చరిత్ర సృష్టించింది. ఈ ప్రతిష్ఠాత్మక టోర్నీ చరిత్రలో ఫైనల్‌కు చేరిన తొలి భారత మహిళా షట్లర్‌గా సింధు అరుదైన ఘనత సాధించింది. శనివారం జరిగిన మహిళల సింగిల్స్ సెమీఫైనల్లో చైనాకు చెందిన మాజీ ఒలింపిక్ ఛాంపియన్ చెన్ యుఫీయ్‌ను ఓడించి సింధు ఫైనల్‌లో అడుగుపెట్టింది. రెండేళ్ల తర్వాత బీడబ్ల్యూఎఫ్ టూర్ ఫైనల్‌కు చేరడం కూడా సింధుకు ఇదే తొలిసారి కావడం విశేషం. సెమీఫైనల్లో సింధు ఆరంభం నుంచే దూకుడుగా ఆడింది. తొలి గేమ్‌లో చెన్ యుఫీయ్ నుంచి గట్టి పోటీ ఎదురైనా కీలక సమయంలో అద్భుత ఆటతో 21–19 తేడాతో గేమ్‌ను కైవసం చేసుకుంది. రెండో గేమ్‌లో కూడా ఆధిపత్యం కొనసాగించిన సింధు 15–10 ఆధిక్యంలో ఉండగా యుఫీయ్ హ్యామ్‌స్ట్రింగ్ గాయంతో ఇబ్బంది పడింది. చివరకు ఆమె రిటైర్డ్ హర్ట్‌గా మ్యాచ్ నుంచి తప్పుకోవడంతో సింధు విజేతగా నిలిచి ఫైనల్‌కు చేరుకుంది. ఈ విజయంతో సింధు మరో ముఖ్యమైన రికార్డును కూడా తన ఖాతాలో వేసుకుంది. చెన్ యుఫీయ్‌పై ఆమె చివరిసారి 2019లో విజయం సాధించింది. ఆ తర్వాత వరుసగా ఐదు మ్యాచ్‌ల్లో ఓడిపోయింది. ఇప్పుడు జపాన్ ఓపెన్ సెమీస్‌లో గెలిచి ఆ పరాజయాల పరంపరకు తెరదించింది. దాదాపు ఏడేళ్ల తర్వాత యుఫీయ్‌పై మరోసారి విజయం నమోదు చేయడం సింధుకు ప్రత్యేకమైన మైలురాయిగా నిలిచింది. మ్యాచ్ ప్రారంభంలో యుఫీయ్ కొంత ఆధిక్యం సాధించినా సింధు వెంటనే పుంజుకుంది. వరుసగా నాలుగు పాయింట్లు సాధించి 10–5తో ముందంజ వేసింది. అయితే చైనా స్టార్ కూడా పోరాటాన్ని కొనసాగిస్తూ స్కోరును సమం చేసే ప్రయత్నం చేసింది. ఈ క్రమంలో ఇద్దరి మధ్య 51 షాట్లతో సాగిన సుదీర్ఘ ర్యాలీ ప్రేక్షకులను అలరించింది. మ్యాచ్ ఉత్కంఠభరితంగా సాగుతున్న సమయంలో స్కోరు 19–19 వద్ద సమమైంది. అలాంటి ఒత్తిడి పరిస్థితుల్లో సింధు తన అనుభవాన్ని ప్రదర్శించి వరుస రెండు పాయింట్లు సాధించి తొలి గేమ్‌ను గెలుచుకుంది. రెండో గేమ్‌లో సింధు మరింత దూకుడుగా కనిపించింది. నెట్ దగ్గర చురుకైన ఆటతో పాటు క్రాస్ డ్రాప్ షాట్లతో యుఫీయ్‌ను ఇబ్బంది పెట్టింది. విరామ సమయానికి 11–7తో ఆధిక్యంలో నిలిచిన సింధు, ఆ తర్వాత కూడా అదే జోరు కొనసాగించింది. స్కోరు 15–10 వద్ద ఉండగా యుఫీయ్ గాయం తీవ్రత పెరగడంతో మ్యాచ్‌ను కొనసాగించలేక వెనుదిరిగింది. ఈ విజయంతో పీవీ సింధు రెండేళ్ల నిరీక్షణకు ముగింపు పలికింది. ఆమె చివరిసారి 2024లో సయ్యద్ మోదీ ఇంటర్నేషనల్ టోర్నీలో ఫైనల్ ఆడి టైటిల్ గెలుచుకుంది. ఆ తర్వాత పలు టోర్నీల్లో మంచి ప్రదర్శనలు చేసినప్పటికీ ఫైనల్‌కు చేరలేకపోయింది. ప్రస్తుతం జపాన్ ఓపెన్‌లో ఫైనల్‌కు చేరడం ద్వారా మళ్లీ తన పాత ఫామ్‌ను అందుకుంటున్న సంకేతాలు ఇచ్చింది.




# భారత తుది జట్టులో మార్పులు

తుది జట్టులోకి కేఎల్ రాహుల్




మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో భాగంగా భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య ఆదివారం మూడో వన్డే జరగనుంది. తొలి వన్డేలో భారత్ గెలిస్తే.. రెండో వన్డేలో ఇంగ్లండ్ నెగ్గింది. దాంతో సిరీస్ విజేత మూడో వన్డేలో తేలనుంది. క్రికెట్ మక్కాగా పిలిచే లార్డ్స్‌లో ఈ పోరు జరగనుంది. , ఈ హై–వోల్టేజ్ మ్యాచ్‌కు ముందు భారత తుది జట్టులో మార్పులు జరిగే అవకాశం ఉంది. రెండో వన్డేకు దూరమైన కేఎల్ రాహుల్ మూడో వన్డే కోసం తుది జట్టులోకి వచ్చే అవకాశం ఉంది. అనారోగ్యం కారణంగా అతడు రెండో వన్డేకు దూరమయ్యాడు. అతడు ఫిట్‌గా ఉంటే మాత్రం మూడో వన్డే ఆడటం పక్కా. అదే జరిగితే ఇషాన్ కిషన్ పక్కకు తప్పుకోవాల్సిందే. ఇక మరో మార్పు కూడా జరగనుంది. రెండో వన్డే మ్యాచ్ ఆడుతున్న సమయంలో వాషింగ్టన్ సుందర్ తొడ కండరాల గాయానికి గురయ్యాడు. గాయం తీవ్రత దృష్ట్యా అతను మూడో వన్డేలో ఆడే అవకాశాలు లేవు. అతడి స్థానంలో హర్ష్ దూబే తుది జట్టులో ఆడతాడని బీసీసీఐ అధికారికంగా తెలిపింది. రెండో వన్డేలో వాషింగ్టన్ సుందర్ కూడా ఆశించిన స్థాయిలో ఆడలేదు. ఈ విషయాన్ని గిల్ పరోక్షంగా ప్రస్తావించాడు. ఇక ప్రిన్స్ యాదవ్‌ను ఆడించాలనుకుంటే మాత్రం ప్రసిధ్ కృష్ణ తప్పుకోవాల్సి ఉంటుంది. అయితే అది జరుగుతుందా లేదా అనేది చూడాల్సి ఉంది. ఇక మరోవైపు రోహిత్ శర్మపై కూడా చాలా వార్తలే నడుస్తున్నాయి. చివరి వన్డే అంటూ కొందరు.. అబ్బే అదేం లేదంటూ బీసీసీఐ ఖండించడం చకచకా జరిగిపోయాయి. ఇప్పటికే రోహిత్ శర్మ పేరెంట్స్ లండన్ చేరుకున్నారని సమాచారం. ఏదో జరుగుతుందని లేకపోతే పేరెంట్స్ ఎందుకు వెళ్తారంటూ సరికొత్త ప్రచారం మొదలైంది. టీమిండియా తుది జట్టు (అంచనా): శుబ్‌మన్ గిల్ (కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్, శివమ్ దూబే, హర్ష్ దూబే, అక్షర్ పటేల్, బుమ్రా, గుర్నూర్ బ్రార్, ప్రసిధ్ కృష్ణ/ప్రిన్స్ యాదవ్

# ఫుట్‌బాల్ చరిత్రలో కొత్త అధ్యాయం

ఫిఫా అధికారిక ప్రకటన ప్రకారం, జులై 19న న్యూయార్క్–న్యూజెర్సీ స్టేడియంలో జరిగే స్పెయిన్ జం అర్జెంటీనా ఫైనల్ విజేత జట్టు సభ్యులు బెస్పోక్ (కస్టమ్) చాంపియన్‌షిప్ రింగ్స్‌ను అందుకోనున్నారు. ఇవి ఫిఫా పోటీల్లో ఇప్పటివరకూ ఎప్పుడూ ఇవ్వని మొదటి రింగ్స్. రింగ్ ఒక వైపు ఫిఫా వరల్డ్ కప్ ట్రోఫీనీ, మరో వైపు విజేత జట్టు గుర్తింపును ప్రతిబింబించేలా డిజైన్ చేశారు. బంగారు రంగులో, నీలి సఫైర్స్, డైమండ్స్‌తో అలంకరించిన ఈ రింగ్స్ అత్యంత ఆకర్షణీయంగా ఉన్నాయి. మొత్తం 2,026 లిమిటెడ్ ఎడిషన్ రింగ్స్ తయారుచేశారు. వీటిలో 30 రింగ్స్.. విజేత జట్టు సభ్యుల (ప్లేయర్స్, స్టాఫ్) కోసం రిజర్వ్ చేశారు. మిగిలిన సుమారు 1,996 రింగ్స్ ప్రపంచవ్యాప్తంగా ఫ్యాన్స్ కోసం అమ్మబోతున్నారు. ఇప్పటి వరకు అధికారిక ధర ప్రకటించలేదు. ఒక్కో రింగ్ సుమారు వి25,000 (సుమారు ?21 లక్షలు) ఉండవచ్చని అంచనా ఉంది. బంగారు, డైమండ్స్, సఫైర్స్‌తో తయారైన లగ్జరీ రింగ్ కాబట్టి ధర ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. ప్రతి రింగ్ ఇండివిడ్యువల్‌గా నంబర్ చేసినది. ఇది టోర్నమెంట్‌ను స్మరించుకోవడానికి ఒక ప్రత్యేక సంకేతం. ఫిఫా ఈ చర్యను అమెరికన్ స్పోర్ట్స్‌లోని చాంపియన్‌షిప్ రింగ్స్ సంప్రదాయం నుంచి ప్రేరణ పొంది ప్రవేశపెట్టింది. ఈ అప్‌డేట్ ఫుట్‌బాల్ ప్రపంచాన్ని కదిలించింది. కొందరు ఫ్యాన్స్ దీనిని స్వాగతించగా, మరికొందరు ఫుట్‌బాల్‌కు అమెరికన్ ఇన్‌ఫ్లుయెన్స్ అని విమర్శించారు. అయినప్పటికీ, విజేతలు.. ట్రోఫీ, గోల్డ్ మెడల్స్‌తో పాటు ఈ రింగ్స్‌ను కూడా అందుకోవడం చరిత్రాత్మకం అవుతుంది. రింగ్ డిజైన్‌లో ఫిఫా వరల్డ్ కప్ లోగో, తద్వారా ఈ రింగ్ ప్రత్యేకమైనదిగా గుర్తింపు పొందుతుంది. ఈ ప్రకటన ఫిఫా ఆర్గనైజేషన్ ద్వారా జూలై 16–17న వెలువడింది. ఈ టోర్నమెంట్.. హోస్ట్ దేశాలైన కెనడా, మెక్సికో, ఖూూలో జరుగుతోంది. ఫైనల్‌లో స్పెయిన్ (యూరో చాంపియన్స్), అర్జెంటీనా (డిఫెండింగ్ చాంపియన్స్) మధ్య తీవ్ర పోటీ ఏర్పడింది. ఈ రింగ్స్ విజేతల గౌరవాన్ని మరింత పెంచుతాయని ఫిఫా తెలిపింది. ఫ్యాన్స్ ఈ రింగ్స్‌ను కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. ఇవి కలెక్టర్స్ ఐటెమ్‌గా మారవచ్చు. ఫిఫా ఈ కొత్త ట్రెండ్‌తో వరల్డ్ కప్‌ను మరింత ఆకర్షణీయంగా మార్చాలని భావిస్తోంది. మొత్తంగా, ఇది ఫుట్‌బాల్‌లో ఆధునికీకరణకు ఉదాహరణ.



మన దునియా
RNI Number TTTTTT/2023/85680
మన అక్షరం - మన ప్రపంచం

# రామ్‌చరణ్–సుకుమార్ కాంబో ఆర్17 పట్టాలకెక్కనుందని ప్రచారం



ఈ ఏడాది పెద్ది సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్టందుకున్న రాంచరణ్ మరోమారు సుకుమార్‌తో సినిమాకు సిద్ధం అవుతున్నారు. వీరి కాంబో రంగస్థలం బాక్సాఫీస్‌ను షేక్ చేసిందని తెలిసిందే. ఈ ఇద్దరి క్రేజీ కాంబోలో మరోసారి ఆర్‌సీ 17సందడి చేసేందుకు రెడీ అవుతోంది. మూవీ లవర్స్‌తోపాటు అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న అప్‌డేట్ ఒకటి నెట్టింట వైరల్ అవుతోంది. తాజా టాక్ ప్రకారం ఆర్‌సీ17 మూవీ ఫైనల్ స్క్రిప్ట్ పూర్తయింది. మేకర్స్ త్వరలోనే గ్రాండ్‌గా ఈ సినిమాను షురూ చేసేందుకు ప్లాన్ చేస్తున్నారని ఫిలింనగర్ సర్కిల్ సమాచారం. అన్నీ అనుకున్నట్టు కుదిరితే వచ్చే సెప్టెంబర్‌లోనే సినిమా లాంచ్ కానుందట. అంతేకాదు నవంబర్ నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలు కానుందని ఇన్‌సైడ్ టాక్. రంగస్థలం తర్వాత సుకుమార్–రాంచరణ్ కాంబోలో వస్తున్న సినిమా కావడంతో అంచనాలు భారీగానే ఉన్నాయి. ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. నటీనటులు, ఇతర సాంకేతిక నిపుణుల వివరాలపై త్వరలోనే మేకర్స్ క్లారిటీ ఇవ్వనున్నారు. ఈ చిత్రానికి రాక్‌స్టార్ దేవీ శ్రీ ప్రసాద్ మ్యూజిక్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడని వార్తలు రాగా.. మరోవైపు ధురంధర్ శశ్వత్ సచ్‌దేవ్ పేరు కూడా తెరపైకి వచ్చింది. రాంచరణ్ నిర్మాతగా నిఖిల్ హీరోగా నటిస్తోన్న ఇండియా హౌస్ చిత్రానికి కూడా శశ్వత్ సచ్‌దేవ్ సంగీతం అందిస్తున్నాడు.

# ఇన్‌స్టాలో దుమ్మురేపిన ఫౌజీ

**ఫస్ట్‌లుక్ విడుదల కాగానే 5.33 లక్షల లైక్స్**

రెబల్ స్టార్ ప్రభాస్ సినిమా అంటే థియేటర్లలో మాత్రమే కాదు, సోషల్ మీడియాలోనూ అభిమానుల సందడి ఏ స్థాయిలో ఉంటుందో మరోసారి నిరూపితమైంది. తాజాగా విడుదలైన ఫౌజీ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ ఇన్‌స్టాగ్రామ్‌లో అరుదైన రికార్డును నమోదు చేసి, భారతీయ సినీ ప్రమోషన్లకు కొత్త బెంచ్‌మార్క్‌ను సెట్ చేసింది. తాజా గణాంకాల ప్రకారం, 'ఫౌజీ' ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదలైన తొలి 24 గంటల్లోనే ఏకంగా 5.33 లక్షల షేర్లు సాధించింది. దీంతో ఇన్‌స్టాగ్రామ్‌లో అత్యధికంగా షేర్ చేయబడిన సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌గా ఇది కొత్త రికార్డును సృష్టించింది. అభిమానులు ఈ పోస్టర్‌ను భారీ స్థాయిలో షేర్ చేస్తూ సోషల్ మీడియాలో ఒక డిజిటల్ వేడుకలా మార్చేశారు. ఈ రికార్డు ప్రభాస్ డిజిటల్ క్రేజ్‌కు మరో నిదర్శనంగా మారింది. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, ఈసారి ప్రభాస్ మరో హీరో రికార్డును కాదు, తన సొంత రికార్డునే బద్దలు కొట్టారు. గతంలో 'స్పిరిట్' ఫస్ట్ లుక్ పోస్టర్ 5.19 లక్షల షేర్లతో అగ్రస్థానంలో ఉండగా, ఇప్పుడు 'ఫౌజీ' దానిని అధిగమించి మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది. దీంతో సోషల్ మీడియాలో ప్రభాస్ ఆధిపత్యం మరింత బలపడిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ పోస్టర్ అభిమానులను అంతగా ఆకట్టుకోవడానికి ప్రధాన కారణం అందులో కనిపించిన ప్రభాస్ లుక్. ఒక వార్‌ట్ లో గాయాలతో కూర్చుని ఉన్న ఆ రూపం చాలా క్రేజీగా కనిపిస్తోంది. ఇప్పటికే ఈ చిత్రానికి సంబంధించిన ప్రతి అప్‌డేట్‌కు సోషల్ మీడియాలో అద్భుతమైన స్పందన లభిస్తోంది. ఫస్ట్ లుక్‌తో వచ్చిన ఈ రికార్డు సినిమా చుట్టూ ఉన్న హైప్‌ను మరింత పెంచింది. ప్రభాస్ అభిమానులతో పాటు, సినీ ప్రేక్షకులు కూడా ఈ సినిమాపై భారీ అంచనాలు పెట్టుకున్నారు. హను రాఘవపూడి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ పీరియడ్ వార్ డ్రామాను మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. ప్రభాస్ పవర్‌ఫుల్ రోల్ లో తెరకెక్కుతున్న ఈ మూవీ డిసెంబర్ 3న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. విడుదలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ, సోషల్ మీడియాలో ఇప్పటికే 'ఫౌజీ' సృష్టిస్తున్న సంచలనం చూస్తుంటే, ఈ సినిమా కోసం అభిమానులు ఎంత ఆసక్తిగా ఎదురుచూస్తున్నారో స్పష్టంగా తెలుస్తోంది.




# ప్రియాంకచోప్రా బర్త్‌డే విషెస్ చెబుతూ వారణాసి లుక్ విడుదల

మహేశ్ బాబు కథానాయకుడిగా రాజమౌళి దర్శకత్వంలో రానున్న చిత్రం 'వారణాసి'లో మహేశ్‌కు జోడీగా బాలీవుడ్ నటి ప్రియాంక కనిపించనున్న విషయం తెలిసిందే. మందాకిని పాత్రలో ఆమె సందడి చేయనున్నారు. శనివారం ఆమె పుట్టినరోజు సందర్భంగా సినిమా సెట్‌లోని ఫొటోలను విడుదల చేస్తూ రాజమౌళి పోస్ట్ పెట్టారు. 'ఆమె నవ్వితే అందం.. నవ్వకపోతే నిప్పు కణిక' అనే క్యాప్షన్ పెట్టారు. ప్రస్తుతం ఈ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మహేశ్ కూడా ప్రియాంకకు విషెస్ చెప్పారు. 'మా ఒకే ఒక్క మందాకినికి హ్యాపీ బర్త్‌డే..' అని పోస్ట్ పెట్టారు. ప్రియాంక 'వారణాసి' కోసం 14 నెలల నుంచి షూటింగ్‌లో పాల్గొంటున్నారు. ఇందులో అద్భుతమైన స్లో మోషన్ జంప్స్ చేసినట్లు ఆమె చెప్పారు. ఇక ఈ చిత్రంలో రుద్ర, శ్రీరాముడిగా మహేశ్ ద్విపాత్రాభినయం చేస్తున్నారు. ప్రపంచంతో పాటు కాలాల్ని చుట్టేసే సాహసికుడి కథగా ఇది ముస్తాబవుతున్నట్లు తెలిసిందే. భారీ బడ్జెట్‌తో పాన్ ఇండియా స్థాయిలో రానున్న ఈ సినిమా వచ్చే ఏడాది ఏప్రిల్ 7న విడుదల కానుంది. ఈ ఏడాది అక్టోబర్ నాటికి చిత్రీకరణ పూర్తి చేసి ప్రచారాన్ని ప్రారంభించనున్నారు. ప్రియాంక చోప్రా ఫొటోస్ రిలీజ్ నేపథ్యంలో సోషల్ మీడియాలో మరోసారి ఆసక్తికర ప్రచారం మొదలైంది. మహేశ్ బాబు పుట్టినరోజు సందర్భంగా ఆగస్టు 9న వారణాసి తొలి గ్లింప్స్‌ను విడుదల చేయనున్నట్లు అభిమానులు, ఫ్యాన్ పేజీలు పెద్ద ఎత్తున పోస్టులు చేస్తూ హల్‌చల్ చేస్తున్నాయి. 'బాబు బర్త్‌డేకు భారీ సర్‌ప్రైజ్', 'బాబు బర్త్‌డేకు గ్లింప్స్ లోడింగ్'. 'ఆగస్టు 9న ఇంతకుముందెన్నడూ చూడని హైప్ చూడబోతున్నారు' అంటూ అభిమానులు సోషల్ మీడియా వేదికగా పోస్టులు షేర్ చేస్తున్నారు. దీంతో హ్యాష్‌ట్యాగ్‌లు ట్రెండింగ్‌లో ఉన్నాయి.





# మరోమారు వార్తల్లో నటి నమిత

**స్లిమ్‌గా మారిన ఫోటోలతో నెటిజన్ల ఆసక్తి**

ఒకప్పుడు టాలీవుడ్, కోలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా వరుస సినిమాలతో ప్రేక్షకులను అలరించిన నమిత ఇప్పుడు మరోసారి వార్తల్లో నిలిచారు. పెళ్లి తర్వాత సినిమాలకు దూరంగా ఉంటూ కుటుంబ జీవితంలో బిజీగా గడుపుతున్న ఆమె.. తాజాగా తన ఫిట్‌నెస్ ట్రాన్స్‌ఫర్మేషన్‌తో సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారారు.ఒకప్పుడు బొద్దుగా కనిపించిన నమిత.. ఇప్పుడు పూర్తిగా స్లిమ్‌గా మారి అభిమానులను ఆశ్చర్యపరుస్తున్నారు. జిమ్‌లో కఠినంగా వర్కౌట్స్ చేస్తున్న వీడియోను ఆమె తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో షేర్ చేశారు. మీ మనసు ఏదైతే నమ్ముతుందో.. మీ శరీరం దానినే అనుసరిస్తుంది అనే సందేశాన్ని కూడా ఆ వీడియోకు జత చేశారు. ఈ వీడియో వైరల్ కావడంతో అభిమానులు, నెటిజన్లు వరుసగా కామెంట్లు చేస్తున్నారు. ఇంత స్లిమ్‌గా మారారు ఏంటి?, నిజంగా ఇది నమితేనా?, స్టైలిష్ లుక్ అదిరిపోయింది అంటూ ప్రశంసలు కురిపిస్తున్నారు. చాలా మంది ఆమె కొత్త లుక్‌ను చూసి ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. నమిత సినీ ప్రయాణాన్ని పరిశీలిస్తే.. కన్నడ, తమిళ, తెలుగు, హిందీ భాషల్లో పలు చిత్రాల్లో నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. తెలుగులో 'సొంతం' సినిమాతో ఎంట్రీ ఇచ్చిన ఆమె.. 'ఒక రాజు ఒక రాణి', 'ఓ రాధ ఇద్దరు కృష్ణుల పెళ్లి', 'బిల్లా', 'నాయకుడు', 'సింహా', 'మన్యం పులి' వంటి చిత్రాల్లో నటించారు. ముఖ్యంగా బాలకృష్ణ నటించిన 'సింహా' సినిమాలో ఆమె గ్లామర్, నటన ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. పెళ్లి అనంతరం సినిమాలకు విరామం ఇచ్చిన నమిత గత కొన్నేళ్లుగా పూర్తిగా కుటుంబ జీవితానికే ప్రాధాన్యం ఇస్తున్నారు. అయితే తాజాగా ఆమె ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టి సరికొత్త లుక్‌లో కనిపించడంతో.. త్వరలోనే మళ్లీ వెండితెరపై రీఎంట్రీ ఇవ్వబోతున్నారా? అనే చర్చ సినీ వర్గాల్లో మొదలైంది. అయితే దీనిపై నమిత నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AAKULA SUDHAKAR, PUSHPALATHA PUBLICATIONS AND PRINTING, HNo: 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLA-BELLY MANDALAM, WARANGAL DIST - 506349, TELANGANA STATE, PUBLISHED PUSHPALATHA PUBLICATIONS HNo. 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLABELLY MANDALAM, WARANGAL DIST- 506349.TELANGANA STATE,TITEL-code : RNI NUMBER ; TELTEL-2O23/85680, Cel1 No: 9603969335, MANADUNIA 2022 @ gmail.com